నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శనివారం 9 నవంబర్ 2024 | HYDERABAD

మేడ్చల్ కలెక్టరేట్‌లో బయోమెట్రిక్

మేడ్చల్: మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో పాటు ఉద్యోగులు సమయపాలన పాటించని నేపథ్యంలో బయోమెట్రిక్ అమలుకు నిర్ణయం తీసుకున్నారు. వివిధ పనుల కోసం జిల్లా కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజలకు అధికారులు, ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో తరచూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో డిసెంబర్ నుంచి బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. కలెక్టరేట్‌లో ఒక అంతస్తుకు రెండు చొప్పున గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మొత్తంగా ఆరు బయోమెట్రిక్ యంత్రాలను అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బయోమెట్రిక్ పద్ధతి అమల్లోకి వస్తే వివిధ శాఖల విభాగాల అధికారులు ఉద్యోగులు, సిబ్బంది హాజరు నమోదు, సమయపాలనపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

శస్త్ర చికిత్స అనంతరం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ కార్పొరేటర్ ముఠా పద్మా నరేశ్‌ను శుక్రవారం పరామర్శిస్తున్న జీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - చిక్కడపల్లి



అవినీతికి అందలం

విద్యుత్ శాఖలో ఇష్టారాజ్యం

కొత్త లేఅవుట్లలో అడ్డగోలుగా లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): విద్యుత్ శాఖలో అవినీతిని సమూలంగా అంతం చేయాలని ఎంత ప్రయత్నం చేసినా ఫలితం ఉండటం లేదు. శివారు ప్రాంతాల్లో కొత్తగా వెలుస్తున్న కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు అవసరమైన విద్యుత్ నెట్ వర్క్ ఏర్పాటు చేయడంలో సెక్షన్ స్థాయి అధికారులు, ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారు. విద్యుత్ శాఖలో అవినీతి మితిమీరిన స్థాయికి చేరిందని, దాన్ని అరికట్టేందుకు ఇటీవల టీజీఎస్‌పీడీసీఎల్ కార్యాలయంలోనే అవినీతి ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పైగా ప్రతి సర్కిల్, డివిజన్, సెక్షన్ కార్యాలయంలోనూ ప్రత్యేకంగా స్టిక్కర్లు అంటించినా ప్రయోజనం లేకుండా పోతున్నది. విద్యుత్ శాఖలో ఇప్పటి వరకు ఉన్నతాధికారులు మొదలుకొని.. కింది స్థాయి ఉద్యోగుల వరకు పదుల సంఖ్యలో ఏసీబీ అధికారుల వలకు చిక్కినా.. కొందరు అధికారులు, సిబ్బంది తీరు మారడం లేదు.



పుట్‌పాత్‌పై గేటెడ్ కమ్యూనిటీ ట్రాన్స్‌ఫార్మర్..

సాధారణంగా నగరంలో అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టులు, కార్యాలయాల భవనాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన బిల్డర్లే తమ ప్రాంగణంలోనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఇటీవల నగర శివారు ప్రాంతంలో ఓ గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు వెంబడి పుట్‌పాత్‌పై ఏర్పాటు చేయడంతో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఫిర్యాదులు రావడంతో విద్యుత్ శాఖ అధికారులకు ఇష్టం లేకపోయినా కొత్తగా ఏర్పాటు చేసినా ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాల్సి వచ్చింది. ఈ విషయంలో సంబంధిత గేటెడ్ కమ్యూనిటీ నిర్మించిన రియల్ ఎస్టేట్ సంస్థకు మేలు చేసేలా సెక్షన్ అధికారులు వ్యవహరించి, అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. ఇలాంటి వ్యవహారాలు శివారు ప్రాంతాల్లో చాలా ఎక్కువగా ఉంటున్నాయని, నిబంధనల ప్రకారం విద్యుత్ నెట్ వర్క్‌ను ఏర్పాటు చేయకుండా, రియల్ ఎస్టేట్ బిల్డర్లకు అనుకూలంగా విద్యుత్ శాఖ సిబ్బంది వ్యవహరిస్తూ లక్షలు దండుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేని లేఅవుట్‌లలో..

జీహెచ్ఎంసీ పరిధిని మినహాయిస్తే శివారులో మున్సిపాలిటీల్లో చాలా వరకు జీపీ లేఅవుట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా జీపీ లేఅవుట్లలో ఇండ్ల నిర్మాణాలు జరుగుతుండడంతో వాటి కోసం నిబంధనలకు పరిగణలోకి తీసుకోకుండానే విద్యుత్ లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం ద్వారా సంస్థకు ఆదాయం వస్తుందని చెప్పి.. లే అవుట్‌లో ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. అనధికారికంగా చేసిన లేఅవుట్‌లలో చాలా చోట్ల రోడ్ల వెడల్పు 30 అడుగుల కంటే తక్కువగా ఉన్నా.. అదే రోడ్లపైనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తూ, విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. జీపీ లేఅవుట్‌లలో పార్కు స్థలాలు, సామాజిక అవసరాల కోసం కేటాయించిన 10 శాతం స్థలం మచ్చుకైనా కనిపించదు. ఇలాంటి చోట విద్యుత్ శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్కరకు రాని టాయిలెట్లకు లెక్కలేని బిల్లులు!

ఏజెన్సీలతో అధికారుల మిలాఖత్
ఒక్కో టాయిలెట్ పేరిట రూ.3,960ల చొప్పున బిల్లు వసూలు
పట్టించుకోని జోనల్ కమిషనర్లు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్స్ పనికి రాకుండా పోతుండగా.. కొందరు అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిపిస్తున్నది. మూడేండ్ల పాటు టెండర్లు దక్కించుకున్న ఏజెన్సీలతో కొందరు అధికారులు మిలాఖత్ అయి.. రికార్డుల్లో నిర్వహణ భేష్ అంటూ బిల్లులు పెట్టేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం టాయిలెట్లకు తాళాలు వేయడం, కనీసం ఎందుకు అక్కరకు రాకుండా ఉంటున్నాయి. నిర్వహణను గాలికి వదిలేసిన కొందరు.. బిల్లులు మాత్రం పెట్టేస్తుండడం గమనార్హం.

1857 పబ్లిక్ టాయిలెట్లు..

ఆరు జోన్లలో 4,826 సీట్లలో 1,857 పబ్లిక్ టాయిలెట్లు ఉండగా.. కూకట్‌పల్లి జోన్‌లో 403 టాయిలెట్స్‌లో ఎక్కువ శాతం నిర్వహణ లేకుండా ఉన్నాయి. అయితే కొన్ని నెలలుగా టాయిలెట్స్ నిర్వహణ సరిగా లేకున్నా బిల్లులు డ్రా చేస్తున్నారన్న అభియోగాలు వస్తున్నాయి. అధికారులు మాత్రం మార్చి నుంచి పేమెంట్స్ జరగలేదని చెబుతున్నారు. వాస్తవంగా మూడేండ్ల పాటు ఏజెన్సీల నిర్వహణపై పర్యవేక్షణ చేసి అందుకు అనుగుణంగా బిల్లులు చెల్లించే బాధ్యత జీహెచ్ఎంసీది. మూడేండ్ల టెండర్ ఏజెన్సీకి ఇచ్చినప్పుడు వారితో పనిచేయించి బిల్లులు ఇవ్వాల్సిన చోట...ఈ ప్రక్రియలో నిర్వహణ లేని ఒక్కో టాయిలెట్‌కు రూ.3,960ల చొప్పున కాంటిజెంట్ బిల్లు పెడుతుండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒక్క కూకట్‌పల్లిని పరిశీలిస్తే..

కూకట్‌పల్లి జోన్ పరిధిలో ఏర్పాటు చేసిన టాయిలెట్స్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు మురుగు కూపాలుగా, అధ్వాన స్థితిలో ఉన్నాయి. 2023 మార్చిలో కూకట్‌పల్లి జోన్ పరిధిలో 403 టాయిలెట్స్‌కు టెండర్ వేశారు. టెండర్ వచ్చిన ఏజెన్సీలు మూడేండ్ల (2026) వరకు వాటి నిర్వహణ బాధ్యతను చేపట్టాలి. టెండర్‌లో ఐదు ఏజెన్సీలకు కాంట్రాక్ట్ దక్కింది. ఇందులో ప్యాకేజీ-1 స్ట్రాటోస్, ప్యాకేజీ-2 ఎస్‌డీ ఫెసిలిటీ సర్వీస్, ప్యాకేజీ-3 గోపీ సురేంద్రకుమార్, ప్యాకేజీ-4 సఫాయి కర్మచారి కాంగార్ సొసైటీ, ప్యాకేజీ-5 శ్రీ దుర్గా భవానీ ఎంటర్ ప్రైజేస్‌కు కేటాయించారు. టెండర్ సమయంలో జోనల్ కమిషనర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, సీటీవో, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో టెండర్లను ఇచ్చారు. వీటి నిర్వహణ సరిగా అయిందా లేదా అనేది అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ పరిశీలించి రిపోర్టు పంపాలి. రిపోర్టులో అన్ని సరిగా ఉంటే బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ నిర్వహణలో లేని వాటికి సైతం బిల్లులు పెడుతున్నట్లు తెలిసింది.

నీళ్లు ఉంటలే.. క్లీన్ చేస్తలే

టాయిలెట్ల క్షేత్రస్థాయిలో లేకున్నా వాటి పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నట్లు, ఇందులో కొన్ని ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 7,400 టాయిలెట్ల నిర్మించగా సగానికి పైగా వినియోగంలో లేవని, కొన్ని చోట్ల గాయబ్ అయ్యాయని, బిల్లులు చెల్లింపులు మాత్రం యథావిధిగా జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చాలా చోట్ల నల్లాలు, డోర్లు, ఇతర సామగ్రి చోరీకి గురికావడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో వివిధ పనుల కోసం వచ్చే వారికి 'అర్జెంట్' అయితే ఎక్కడికి వెళ్లాలో అర్థం కానీ పరిస్థితి . తిరిగి పే అండ్ యూజ్ టాయిలెట్లకు వెళ్లకతప్పడం లేదు. ఆర్టీసీ బస్టాప్‌లు, పుట్‌పాత్‌లు, పార్కుల వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్లలో చాలా వరకు ప్రస్తుతం కనిపించడం లేదు. వాస్తవానికి కమర్షియల్ ఏరియాల్లో ఉండే టాయిలెట్లను రోజుకు నాలుగు సార్లు, నాన్ కమర్షియల్ రోజుకు కనీసం మూడు సార్లు క్లీన్ చేయాల్సి ఉంటుంది. డైలీ క్లీనింగ్ చేస్తున్నారా? అంటే లేదనే స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని టాయిలెట్లకు కనీసం డోర్లు కూడా ఉండటం లేదని చెబుతున్నారు. వీటికి తోడు మరుగుదొడ్లలో నీళ్లు కూడా అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. దీంతో విధిలేక చాలా మంది 'పే అండ్ యూజ్' , బస్టాప్‌ల వద్ద ఉండే సులభ్ కాంప్లెక్స్‌లను ఎక్కువగా వినియోగిస్తుండటం గమనార్హం.

ఇండ్లే మినీ పేకాట క్లబ్బులు

నగరంలో మళ్లీ వ్యవస్థీకృత నేరాలు
కొరవడిన పోలీసుల నిఘా

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో వ్యవస్థీకృత నేరాలు పెరుగుతున్నాయి. గత బీఆర్ఎస్ సర్కారు ఉక్కుపాదంతో అణిచివేసిన పేకాట క్లబ్బులు మెల్లగా తెరుచుకుంటున్నాయి. తిరిగి పేకాట దందాలు ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పురుడు పోసుకుంటుండడం ఆందోళన కలిగిస్తున్నది. కిరాయి ఇండ్లను అడ్డగా చేసుకొని బెట్టింగ్ రాయుళ్లు దందాను సాగిస్తున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల పోలీసులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. దొంగతనాలు, బెట్టింగ్, స్నాచింగ్‌లు ఇలా అన్ని నేరాలు రాజధాని నగరంలో పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే కేసీఆర్ ప్రభుత్వం వ్యవస్థీకృత నేరాలను ఉక్కుపాదంతో అణిచివేసింది. పేకాట క్లబ్బులతో సామాన్యుడు, పేద ప్రజలు ఆర్థికంగా చితికిపోయి, ఆత్మహత్యలు చేసుకొని, ఆయా కుటుంబాలు రోడ్ల పైకి వచ్చిన పరిస్థితులు సైతం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నాయి. అలాంటి పరిస్థితి తెలంగాణలో ఉండకుండా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకున్నది. రోజంతా పనిచేస్తే వచ్చే డబ్బును బెట్టింగ్‌లో పోగొట్టుకోకుండా, అసలు ఆ బెట్టింగ్ దందాలే రాష్ట్రంలో లేకుండా చేసింది. అయితే నేడు ఆ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చేస్తున్నది. ఇబ్బడి ముబ్బడిగా మినీ పేకాట క్లబ్బులు వెలుస్తున్నాయి.

ఇండ్లే అడ్డాలు..

పేకాట అనేది ఇప్పుడు అన్ని వర్గాలకు విస్తరించింది. నిర్వాహకులు బస్తీలు, కాలనీలతో పాటు వ్యాపార సముదాయలుండే చోట ఇండ్లను కిరాయికి తీసుకుంటున్నారు. సౌత్‌జోన్, సౌత్‌వెస్ట్, సౌత్‌ఈస్ట్, మహేశ్వరం వంటి జోన్లలో ఎక్కువగా బస్తీల్లో అడ్డాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. నిర్వాహకులు బస్తీల్లో ఒకటి రెండు చోట్ల ఇండ్లను కిరాయికి తీసుకుంటూ, అక్కడ ఒక పోర్షన్ కుటుంబానికి అప్పగించి, ఆ ఇంట్లో వెనుక, పక్కలో ఉండే పోర్షన్లను పేకాట కోసం ఉపయోగిస్తున్నట్లు తెలిసింది.

వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం..

స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉండే వారు కూడా పేట క్లబ్బులకు హాజరవుతున్నట్లు సమాచారం. ఏ రోజు ఏ అడ్డాలో పేకాట మినీ క్లబ్ నిర్వహిస్తారు అనే సమాచారాన్ని వాట్సాప్ గ్రూప్‌లో చేరవేస్తున్నట్లు తెలిసింది. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని కొన్ని చోట్ల మినీ పేకాట క్లబ్బులు నిర్వహిస్తున్నా, అప్పుడప్పుడు పోలీసులు దాడులు చేసి పట్టుకుంటున్నారు. అయితే ఈ మినీ పేకాట క్లబ్‌ల నిర్వాహకులు దొరికితేనే దొంగ లేదంటే.. దొరగా చెలామణి అవుతుంటారని తెలిసింది. రెండు రోజుల కిందట ఫిలిం నగర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మినీ పేకాట క్లబ్బులపై దాడులు నిర్వహించి.. 13 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే గత కొన్ని రోజులుగా ఇక్కడ మినీ పేకాట క్లబ్బు నడుస్తున్నా.. స్థానిక పోలీసులు గుర్తించలేకపోయారనే విమర్శలొస్తున్నాయి.

ఉప్పల్ స్టేడియం వద్ద ప్రహరీపై వరల్డ్ కప్ అందుకున్న క్రికెటర్ కపిల్‌దేవ్ చిత్రాన్ని వేస్తున్న కళాకారులు

ఉద్యోగం అడిగితే.. లైంగికంగా వేధించాడు

లొంగకపోవడంతో వేరే చోటుకు బదిలీ
ఎస్ఎఫ్ఏపై అంబర్‌పేట పారిశుధ్య కార్మికురాలు ఆరోపణ
న్యాయం చేయాలంటూ.. ప్రభుత్వానికి విజ్ఞప్తి

అంబర్‌పేట: 'నా భర్త ఉద్యోగం కోసం అడిగినందుకు లైంగికంగా వేధించడమే కాకుండా వేరే డివిజన్‌కు బదిలీ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్న ఎస్ఎఫ్ఏ గోల్నాక శ్రీనుపై చర్యలు తీసుకొని.. న్యాయం చేయాలి' అని పారిశుధ్య కార్మికురాలు జి. సునీత ప్రభుత్వం, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం భర్త చెన్నయ్యతో కలిసి సునీత అంబర్‌పేటలో మీడియాతో మాట్లాడుతూ 25 ఏండ్ల కిందట అప్పటి ఎంసీహెచ్‌లో జి.సునీత శానిటేషన్ వర్కర్స్ గ్రూప్‌ను 21 మంది సభ్యులతో ఏర్పాటు చేసినట్లు బాధితురాలు తెలిపారు. ఇందులో గ్రూపు అధ్యక్షురాలిగా తాను ఉంటూ.. పారిశుధ్య పనులు, తన భర్త చెన్నయ్య కామటీగా పని చేసినట్లు చెప్పారు. అప్పట్లో కాంట్రాక్టర్ నరసింహారెడ్డి వద్ద అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా నుంచి అలీకేఫ్ వరకు తాము పారిశుధ్య పనులను నిర్వహించే వారమన్నారు. 2012లో ప్రైవేట్ కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించడంతో అప్పటి నుంచి తాము పటేల్‌నగర్ చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐదేండ్ల కిందట తన భర్త చెన్నయ్యకు ఫిట్స్, పక్షవాతం వచ్చిందని సునీత చెప్పారు. దీంతో తాము గ్రూపు సభ్యులందరి సమ్మతంతో నాగరాజుని తాత్కాలిక సహాయకుడిగా నియమించుకున్నట్లు వివరించారు. అతను కొద్ది రోజులకే పని మానివేయడంతో బతుకమ్మకుంటకు చెందిన బాబును అందరి అంగీకారంతో సహాయకుడిగా పెట్టుకున్నామన్నారు. బాబు ఎస్ఎఫ్ఏ గోల్నాక శ్రీను సహకారంతో అధికారులకు ముడుపులు అందించి.. తన భర్త పేరును ఉద్యోగం నుంచి తొలగించి.. బాబు పేరును పెట్టి తమకు అన్యాయం చేశారని సునీత ఆరోపించారు. విషయం తెలిసి ఎస్ఎఫ్ఏ శ్రీను, బాబును అడిగితే తమపై దౌర్జన్యం చేయడమే కాకుండా ఇంటికి వచ్చి దాడికి పాల్పడ్డారన్నారు. ఎస్ఎఫ్ఏ గోల్నాక శ్రీను లైంగికంగా వేధిస్తూ, అతనికి లొంగకపోవడంతో తనను అన్యాయంగా నల్లకుంటకు బదిలీ చేయించాడని బాధితురాలు సునీత ఆరోపించారు. ప్రభుత్వం, బల్దియా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని చెన్నయ్య, సునీత దంపతులు విజ్ఞప్తి చేశారు.

హైడ్రా నోటీసులంటూ ప్రచారం

ఖండించిన కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై హైడ్రా దృష్టిపెట్టిందని, 50 మందికి నోటీసులంటూ సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఈ ప్రచారాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఖండించారు. కొన్నిరోజుల కిందట అమీన్‌పూర్‌లో కిష్టారెడ్డిపేటలో ఒక సర్వేనంబర్ చూపించి మరో సర్వే నంబర్‌లో భూమి అమ్మడంపై వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా బృందం సర్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సర్వే రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటించారు. అదే సమయంలో స్థానికంగా ఉన్న కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించి విచారణ చేపడతామన్నారు. అయితే ప్రస్తుతం హైడ్రా బృందం బెంగళూరులో ఉన్న సమయంలో హైడ్రా నోటీసులంటూ, కూల్చివేతలు, పదిహేను రోజుల గడువంటూ వైరల్ అవుతున్నది. దీంతో రంగనాథ్ ఇదంతా ఫేక్ ప్రచారమంటూ ఖండించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

జవహర్‌నగర్, నవంబర్ 8: విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ప్రగతినగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రగతినగర్ కాలనీలో శానమ్మ కుమారుడు వరుణ్(7)తో కలిసి నివాసముంటున్నది. వరుణ్ దేవేందర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. స్కూలు నుంచి ఇంటికి వచ్చిన వరుణ్ టీవీ చూస్తూ..మంచంలో పడుకున్నాడు. ప్రమాదవశాత్తు తీగలు తెగిపడి విద్యుదాఘాతంతో మంటలు అంటుకొని చనిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానాకు తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

> నాందేడ్‌కు చెందిన వెంకటేశ్ నాగేశ్ కులకర్ణి (24) రోడ్డు ప్రమాదంలో గాయపడి.. నిమ్స్‌లో చికిత్స పొందుతూ.. బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. శుక్రవారం అతడి కుటుంబసభ్యుల అంగీకారంతో జీవన్‌దాన్ ప్రతినిధులు నాగేశ్ శరీరం నుంచి కాలేయం, గుండె, రెండు మూత్రపిండాలు, కార్నియాలను సేకరించారు. బాధిత కుటుంబసభ్యులను అభినందించిన డాక్టర్ శ్రీభూషణ్ రాజు.. ఆరుగురు జీవితాల్లో వెలుగులు నింపిన అవయవదాతకు ఇలా నమస్కరించారు.
>
> -ఖైరతాబాద్, నవంబర్ 8

కమిషనర్ లేరు.. కానిచ్చేయ్!

ఝార్ఖండ్ ఎన్నికల అబ్జర్వర్‌గా బల్దియా ఎఫ్ఏసీ కమిషనర్
రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో ఇష్టారీతిలో బదిలీలు
ఇటీవల డీసీల పోస్టింగ్‌లో పైరవీకి పెద్దపీట
గతంలో బదిలీ అయిన వారంతా అడ్డదారిలో మళ్లీ వెనక్కి
చక్రం తిప్పుతున్న అడ్మిన్ ఉన్నతాధికారి

సిటీబ్యూరో: కోటికి మందికి పైగా జనాభా కలిగిన నగరంలో పౌరులకు మౌలిక వసతుల కల్పన, మెరుగైన సేవలందించడంతో బల్దియాదే ముఖ్య భూమిక. అలాంటి కీలకమైన శాఖకు రెగ్యులర్ కమిషనర్‌గా పట్టుమని రెండేండ్లు ఉండటం లేదు. అలా వచ్చి .. ఇలా వెళ్తున్నారు. రోనాల్డ్ రాస్ మొదలుకొని ఆమ్రపాలి వరకు గడిచిన 11 నెలల్లోనే జీహెచ్ఎంసీకి ఇద్దరు కమిషనర్లు మారారు. గత జూన్ నెలలో రెగ్యులర్‌గా ఉన్న రోనాల్డ్ రాస్ బదిలీపై ఇంధన శాఖకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వచ్చిన ఆమ్రపాలి నాలుగు నెలలు గడవకముందే జీహెచ్ఎంసీనే కాదు రాష్ట్రాన్ని వదిలివెళ్లాల్సి వచ్చింది. గత నెల 17న రవాణాశాఖ కమిషనర్‌గా ఉన్న ఇలంబర్తిని ఎఫ్ఏసీ కమిషనర్‌గా జీహెచ్ఎంసీకి ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలోనే గత వారంలో ఇలంబర్తి ఝార్ఖండ్ రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్‌గా వెళ్లాల్సి వచ్చింది. ఇదే సమయంలో ఆయన అక్కడి నుంచే అధికారులతో టచ్‌లో ఉంటూ.. ఆన్‌లైన్ (ఈ-ఆఫీస్/వాట్సాప్) ద్వారా పాలనా వ్యవహారాలు చూస్తూనే వస్తున్నారు. అయితే కొన్ని టౌన్ ప్లానింగ్, కొత్త విధానాలు, ఇతర కీలకమైన ఫైళ్లను ఆయన చూడలేకపోతుండటంతో పాలనాపరమైన సమస్యలు వస్తున్నాయి. అదే రెగ్యులర్ కమిషనర్ ఉంటే సరైన నిర్ణయాలు ఉంటాయి. ఎఫ్ఏసీ కమిషనర్ కావడంతో కొందరు ఉన్నతాధికారులు ఇదే అదనుగా సంస్థగత లోపాలను ఆసరాగా చేసుకొని దందాకు తెరలేపారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ పాలన గాడితప్పడం, ప్రజా సమస్యలు పెరిగిపోవడం, అవినీతి అధికారులు అడ్డదారిలో కీలక స్థానాలను దక్కించుకుంటూ, పనిచేసే అధికారులు అప్రాధాన్యత పోస్టుల్లో ఉంటుండడం రాబోయే రోజుల్లో పరిస్థితి ఎట్లా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పైరవీలకు పెద్దపీట

ఇటీవల ఇద్దరు డిప్యూటీ కమిషనర్ల(డీసీ) బదిలీల్లో ఓ డీసీ అంశం ఉద్యోగుల్లో విస్తృత చర్చకు దారి తీసింది. జీహెచ్ఎంసీతో పాటు శివారులోని ఆదాయం ఉన్న మున్సిపాలిటీల్లో కమిషనర్‌గా సదరు డీసీ పనిచేశారు. గతంలో ఆయన ఖైరతాబాద్ డీసీగా పని చేశారు. అక్కడి నుంచి నిజాంపేట కార్పొరేషన్‌లో కమిషనర్‌గా పోస్టింగ్ తెప్పించుకున్నారు. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు లీవ్‌లో వెళ్లారు. తర్వాత పైరవీతో పీర్జాదిగూడ కార్పొరేషన్ కమిషనర్‌గా వచ్చారు. అక్కడ మళ్లీ లీవ్‌లో వెళ్లి బల్దియాలో అత్యధిక ఆదాయం వచ్చే సర్కిల్ చందానగర్‌లో పోస్టింగ్ ఇప్పించుకున్నారు. కాగా, ఏండ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను గత కమిషనర్ ఆమ్రపాలి బదిలీలు చేశారు. అయితే చాలా మంది పలుకుపడి ఉపయోగించి తిరిగి అదే పోస్టింగ్ దక్కించుకున్నారు. ఇప్పటి వరకు దాదాపు 15 మంది ఉద్యోగులు పైరవీలతో వచ్చినట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. అడ్మిన్ విభాగంలో కీలక అధికారి అన్నీ తానై ఈ వ్యవహారాలను చక్కపెడుతున్నట్లు వినికిడి.

బిగ్ బ్రదర్స్ అయ్యప్ప సొసైటీపై తమ మార్క్ చూపించడంతో సదరు డీసీ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. బిగ్ బ్రదర్స్ అక్రమ నిర్మాణదారులను తమకు కూడా కప్పం కట్టాలి అనడంతో అప్పటికే తాము డీసీకి చెల్లించాం అని చెప్పడంతో అక్కడ లొల్లి మొదలైంది. ఇంకా ఇక్కడే ఉంటే ఇబ్బందుల్లో పడతామని స్టడీ లీవ్‌లో వెళ్లారు. మళ్లీ సదరు డీసీకి మూసాపేటలో పోస్టింగ్ వచ్చింది. లీవ్‌లు పెట్టి.. మంచి పోస్టింగ్ కోసం వెయిట్ చేసే వారికి అధికారులు అందలం వేయడంపై ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జి కమిషనర్ లేకున్నా అడిషనల్ కమిషనర్ అడ్మిన్ తన అనుకున్న వారికి మంచి పోస్టింగ్‌లు ఇవ్వడంపై నిరసన వ్యక్తమవుతున్నది. అయితే కమిషనర్ పరిశీలనలో పెట్టి ఆయన అనుమతితో పోస్టింగ్ ఇవ్వొచ్చు అని అడ్మిన్ విభాగం చెబుతున్నది.